ఎదురుగాలి

[కథానిక]

'చతుర్వేది'

పిల్లకి సుశీల అని పేరు పెట్టేటప్పుడు తల్లిదండ్రుల గుండెల్లో ఎటువంటి పవిత్రమైన కోరికలు ధగధగ మెరిసినవో ఎవరు చెప్పగలరు? తమ చిన్నకూతురు శీలవతియై, గుణవతియై సీతతోనూ, సావిత్రితోనూ తులతూగాలని ఎంత ఆశపడ్డారో ఎవరికి తెలుసు?

ఇప్పుడుమాత్రం ఆపేరు చెవినిపడితే చాలు వారి గుండెలు భగ్గున రగులుతయ్. సుశీల అనే పేరే వారికి ఎంతో వెటకారంగా కనిపిస్తుంది. ఎవరైనా ఆపేరు ఉచ్చరిస్తే చాలు తల్లిదండ్రులు లోపల ఉడికిపోతారు. తమ వంశగౌరవానికే చిచ్చుపెట్టిన నీచురాలిని సుశీల అని పిలవటంకంటె విడ్డూరమేముంటుంది? ఇప్పటి స్థితిలో తమ కూతురిని సుశీల అనటంకంటె వెటకారం మరొకటి వుండబోదని తల్లిదండ్రుల అభిప్రాయం.

కన్న తల్లిదండ్రులకే ఇంత శత్రువైపోయిన సుశీల లోకానికి ఇంకెంత చులకనైపోయిందో వేరే చెప్పనక్కరలేదు. ఈనాడు సుశీలశీలాన్ని, నడతనీ చీల్చిచెండాడటానికి మూలనున్న ముసలమ్మకు కూడా వీరావేశం వస్తుంది. ఈనాడు సుశీ జీవితంమీద అందరి విమర్శలూ, దూషణలూ నల్లేరుమీద బండిలా చరచరా సాగిపోతయ్. సుశీలను ఎంత తిట్టినా ఇంకా తగ్గట్లు తిట్టలేదని విచారించేవారేకాని వెనకేసుకొచ్చి నొచ్చుకొనేవారొక్కరూ లేరు. అంతదాకా వస్తే సుశీలే తనను తాను వెనకేసుకొస్తుందా అనేది అనుమానాస్పదమైన విషయమే.

అందుకే సుశీల నా అనేవారెవరూ లేని చోటికి వెళ్లి జీవయాత్ర కొనసాగిస్తోంది. ఆకస్మికంగా పూర్వపరిచితులెవరైనా కనిపించినా తలవంచుకుని దూరంనుంచే పైదొలగిపోతుంది. తనకు లోకంలో ఎటువంటి విలువ వుందో, ఎంత గౌరవం వుందో సుశీల ఇదివరకే గ్రహించింది. కనకనే లోకంతో ముఖాముఖి ఎన్నడూ తలపడదు. తనకు నలుగురిలోకి నిర్భయంగా వచ్చి నిలబడటానికి ఏదో చెప్పలేని జంకు. ఎక్కడికి వెళ్లినా తన చరిత్ర నల్లటి నీడలాగా తనవెంటనే తరుముకువస్తున్నదనే అనుమానం. తన సంగతే అందరూ గుసగుసలాడుకుంటున్నట్లు సంకోచం. ఎంత దూరదేశంలో వున్నా శత్రుశరపరంపరమధ్య అసహాయురాలై నిలబడినట్లే సుశీలకు అనిపిస్తోంది. అందుకే తను ఎవరిళ్లకీ పోదు. ఒకరు తన ఇంటికి రావాలని కోరుకోదు. తన పిల్లలనుకూడా గడపదాటనివ్వదు. ఎటువంటి మాటలు వాళ్ల చెవిని పడతయ్యో, వాళ్ల లేతమనసులు ఏం బాధపడతయ్యో అని సుశీల పిల్లల్ని క్షణమైనా బైటికిపోనిచ్చేదికాదు. గాలీ వెలుతురూ లేని చీకటి చెఱలో క్షణం కూడా హాయిలేకుండా సుశీలమనస్సు ఆపసోపాలుపడుతోంది. తను ఒకళ్ల జోలికి పోదు. తను ఉలిపికట్టె. అయినా లోకం తనదారిని తనను పోనివ్వదు. పొరుగింటావిడ గోడవతలనుంచి తనకు వినబడేట్లు మాటిమాటికీ ఎత్తిపొడుస్తూఉంటుంది—"మనంరాణివాసపుస్త్రీలమా యేమిటి? ఇగుగుపొరుగిళ్లకి పోకపోతే మన కిల్లా గడుస్తుందీ?" అని.

ఒకరోజు పొరుగింటికి బియ్యం బదులుతెచ్చుకోటంకోసం సుశీల వెళ్లకతప్పిందికాదు. తీరికగా చుట్టుపక్కల అమ్మలక్కలంతా కొలువుతీర్చి కూర్చున్నారు. లోకాభిరామాయణంలో మునిగి తేలుతు

న్నారు. సుశీలను చూపులతో తూట్లుపడేటట్లు గుచ్చారు. సుశీలకు అంతమందిలో తల ఎత్తటానికి చచ్చినచావుగా వుంది. వెనక్కు తిరిగి వెళ్లిపోదామనుకుంటుండగా పొరుగింటి పుల్లమ్మగారు "కూర్చోఅమ్మా, ఏమైనా పనిమీద వచ్చావా! ఇన్నాళ్లకు మామీద దయ గలిగిందికాబోలు. పెద్దదాన్ని నేనే ముందుగా వద్దామనుకున్నానుగాని పిలవని పేరంటానికి పనివేళాపోవటం దేనికని ఊరుకున్నాను" అంటూ అనర్గళంగా ఏమిటేమిటో మాట్లాడేస్తోంది. సుశీలకు తలమీద దబదబా రాళ్ల వాన కురుస్తున్నట్లనిపించింది. ఎల్లాగో పెగుల్చుకుని వచ్చిన పని యేమిటో చెప్పింది. బియ్యం నిండుకున్నయ్యని చెప్పింది పొరుగింటావిడ. సుశీల ఇంటిదారి పట్టాలనుకుంటుండగానే పొరుగింటావిడ చెయ్యిపట్టుకుని బలవంతాన కూచోబెట్టి ప్రశ్నలవర్షం కురిపించటం ఆరంభించిది—"నీపేరేమిటి? పుట్టింటివారి దేవూరు? అత్తవారి దేవూరు? మీవారి దేంపని? ఎందరుపిల్లలు?" అని గుచ్చిగుచ్చి అడగటం మొదలుపెట్టింది. సుశీల కొన్నిటికి జవాబులుచెప్పి, కొన్నిటికి చెప్పలేక తడబడిపోతూ బెదురుచూపులు చూసింది. ఈ పద్మవ్యూహంలోంచి ఎల్లా బైటపడతానా అనే ఆరాటం సుశీలకు. ఈదొరికిన అభాగ్యురాలిని ఇంకా ఎన్ని విధాలుగా చీల్చిచెండాడుదామా అనే చెలగాటం అమ్మలక్కలకు. సుశీలకు వినపడకుండా గుసగుసలూ, ఒకరి ముఖంకేసి ఒకరు చూసుకుంటూ ముసిముసినవ్వులూ, వెటకారపుచూపులూ! అక్కడున్న పదినిమిషాలూ పదియుగాలుగా తోచినై. కణకణ మండే నిప్పులగుండంలో నిలబడినట్లనిపించింది. చివాలున లేచి నిలబడి, వెళ్లొస్తానని బయలుదేరింది. "అప్పుడే వెళ్తావుటమ్మా! చూసినట్టే లేదు, మాట్లాడినట్లే లేదు. కాస్త ఇరుగుపొరుగున వున్నందుకు అప్పుడప్పుడూ వచ్చి తొంగిచూసిపోతూ వుండు తల్లీ" అంది పొరుగావిడ. అప్రయత్నంగా సుశీలకాళ్లు వణికినై. కళ్లు తడిసినై. "చచ్చిన పామును చంపటం ఎందుకు తండ్రీ?" అని దీనంగా ఒక ఆక్రోశం విడిచింది.

ఇంట్లో అడుగుపెట్టేసరికి పిల్లలు అన్నంపెట్టమని చుట్టేశారు. ఇంట్లో బియ్యపుగింజలేదు. చేతిలో చిల్లిగవ్వలేదు. తన వంటిమీద బంగారమంతా ఇదివరకేహరించిపోయింది. మెళ్లో సూత్రంకూడా భర్త జబర్దస్తీచేసి తీసుకొన్నాడు. పైగా "నీక్కూడా సూత్రంకావాలా"అని వెటకారంచేశాడు. సుశీలమాత్రం ఎదురుచెప్పకుండా తన మాంగళ్యాన్ని నిలబెట్టుకోటానికి పసుపు కొమ్మొకటి కట్టుకుంది. కాని "నీక్కూడా సూత్రం కావాలా"అని సుందరం అడిగిన ప్రశ్నకు ఆమె గిలగిల తన్నుకుంది. అతని దృష్టిలో తను ఇంత చులకనైపోతానని ఆమె కలలోకూడా అనుకోలేదు. అతనుకూడా తనను ఇంత నీచంగా పరిగణిస్తాడని సుశీల ఎన్నడూ తలపోయలేదు. పిల్లలు ఆకలికి కళ్లలో ప్రాణాలుపెట్టుకుని ఉసూరుమంటున్నారు. తను అన్నంముఖం చూసి మూడుపూటలు దాటింది. మంగళసూత్రం పుచ్చుకుని పోయి మూడురోజులైనా ఇంతవరకూ భర్తజాడ లేదు. ఎక్కడా అప్పుపుట్టదు. ఎక్కడా బదులుదొరకదు. దొరక్కపోగా తన మనసును చిత్రవధచేసి మాటలూ,నిందలూ ప్రతివాళ్లూ తమ అక్షయతూణీరంలోంచి ఆమెమీదకు విసురుతారు. ఇదివర కెప్పుడూ పల్లెత్తుమాటఅని ఎరగని సుందరం ఇంత హేళనంగా, ఇంత చులకనగా మాటాడటానికి వెనుదీయలేదు. ఎటుచూసినా అవమానం, పరాభవం. ఎక్కడికిపోయినా పీడని దారిద్ర్యం. కోరలు తెరుచుకున్న క్రూరరాక్షసి ఎవరో తనను క్షణం కూడా విడవకుండా వెన్నంటి తరుముకువస్తోంది. లోకమంతా పడగ విప్పిన పాములాగా బుసలు కొడుతోంది. తనూ,తన పిల్లలూ అసహాయులైఆర్తులై దీనంగా శత్రువుల చేజిక్కిన ఖైదీలలాగా క్షణమొక యుగంగా సతమతమై పోతున్నారు. ఈ యమయాతననుంచి విముక్తిలేదా?

ఇల్లా ఆలోచిస్తూ గోడకు జేర్లబడి కూచుంది సుశీల. ఆకలిమంటతోపాటు ఆరనిమంట ఏదో లోపల భగభగ రగిలిపోతోంది. "ఇదంతా నాకు విధి విధించిన శిక్ష కాకూడదా? ఇదంతా నా తప్పిదానికి ప్రాయశ్చిత్తం కాకూడదా?"అనిపించింది ఒక్కక్షణంసేపు. వెంటనే సుశీల ఈదౌర్బల్యానికి సిగ్గుపడింది. ప్రవాహానికి ఎదురీదలేక అలసిపోయి తనను తాను నిందించుకుంటోంది. ఇదివరకు ఎవరైనా అటువంటి మాటలు తనను అంటే మండిపోయేది. ఇప్పుడు తనను తానే అంతకంటే

వెయ్యినోళ్లు నిర్దయతో నిందించుకుంటోంది. ఎంత సిగ్గు చేటుపని? కదనరంగంలో జోరబడినతరువాత నడిమధ్యలో ఖడ్గం జారవిడిస్తే ఎల్లాగు? ఇన్ని శత్రులను ఎదిరించాలని తనకు ముందుగా తెలియదా? ఎదుర్కొనగల సత్తా లేనప్పుడు తనూ అందరిలాగే విధికి బానిసయై పోయి తలవంచక ఎందుకు ఎదురు తిరగాలి? ఒక్కసారిగా సుశీలలో అణగారిపోతున్న ధైర్యం తటుక్కున మెరిసింది. నేను చేసిన తప్పు ఏముంది? దాన్ని తప్పుగా పరిగణించి శిక్షించగల అధికారం ఎవరికుంది? నేను ఎవరికీ లొంగను. దేనికీ జంకను అనే విప్లవోత్సాహంతో సుశీల కంపించిపోతోంది.

ఇంతలో తలుపుతట్టిన చప్పుడు. ఎంతో ఆత్రంతో గబగబా వెళ్లి తలుపు తీసింది. ఇంట్లోకి వస్తూనే తూలుతూసోలుతూ, నోటికివచ్చిన దల్లా పేలుతూ భర్త సుందరం అడుగుపెట్టాడు. సుశీల ఆపాదమస్తకం గజగజ వణికిపోయింది. తనకూ పిల్లలకూ తినేటందుకు ఏమైనా తెస్తాడేమోనని కొండంత ఆశతో ఎదురు చూస్తోంది. ఒక్కసారిగా పాతాళంలోకి తొక్కివేసినట్లయిపోయింది. తనూ, పిల్లలూ ఆకలిచిచ్చుతో కుమిలి కృశించిపోతుంటే భర్త తప్పతాగి తందనాలాడుతూ ఇంటికివచ్చాడు. రాగినయ్య సంపాదించలేదు. పైగా తన వంటిమీద చిన్నంబంగారంకూడా లేకుండా వొలుచుకుని తినేశాడు. నకనకలాడుతూ చిక్కి శల్యాలై పోయిన పిల్లలు కళ్లకు కొట్టవస్తున్నారు. వాళ్లు తన ప్రాణానికి ఉసూరుమంటున్నారు. వాళ్లను బతికించుకోవలసిన భారం తనమీద వుంది. తను ఏం చేయగలదు? ఏవిధంగా జీవయాత్ర కొనసాగించగలదు? పోనీ, తనకు వచ్చిన సంగీతం నలుగురుపిల్లలకు పాఠాలుచెప్పుకుని బతుకుదామా అంటే అది వీలులేకుండావుంది. తన యింటికి పాఠానికి పిల్లల్ని పంపటానికి తల్లిదండ్రు లెవరూ సాహసించరు. పోనీ, తను మానాభిమానాలకు నీళ్లు వదిలి ఇంటింటికీ తిరిగి పాఠాలు చెప్పుకుందామంటే ఎక్కడికిపోయినా చుక్కఎదురే. తన పూర్వచరిత్రనూ, ప్రస్తుతజీవితాన్నీ శల్యపరీక్షచేసి తనను చిత్రవధచేసి చివరకు జీతం దమ్మిడీ ముట్టచెప్పకుండా పంపివేసిన పుణ్యాత్ములెందరో వున్నారు. ఇక తను ఏంచెయ్యాలి? ఏం చెయ్యగలదు? ముగ్గురు నిరపరాధులను, నిర్భాగ్యులను ఈ లోకంలోకి తీసుకువచ్చినందుకు, ముక్కుపచ్చలారని పసివయస్సులోనే వారిని పడరానిపాట్లకు గురిచేస్తున్నందుకు తను బాధ్యురాలు కాదా? తన బాధ్యతను ఏవిధంగా నెరవేర్చాలి? సుందరంమటుకు బాధ్యుడు కాడా? అట్లనుకాని అతను ఏబాధ్యతనూ గ్రహించగల స్థితిలో లేడు. రోజుకొక కొత్తవ్యసనానికి బానిస అవుతున్నాడు. నానాటికీ దిగవాసిల్లుతున్నాడు.

చిన్నప్పుడు సుందరం సుగుణాలకు గనిఅని అంతా అనుకునేవాళ్లు. సుందరంకంఠంలో తుంబురునితోనూ, నారదుడితోనూ పోటీచేసే హాయి వుందని అంతా ఒప్పుకునేవాళ్లు. ఇప్పటి సుందరానికీ, అప్పటి సుందరానికీ పోలికే లేదు. తాగిన మగతలో "ఎంత వేడుకుందూ...రాఘవా" అని కృతి అందుకుని మొదటిచరణంలో ఆగిపోయాడు. ఇదివిని సుశీల జలదరించింది. ఆపుకోలేకుండా వెక్కివెక్కి ఏడుస్తూ సుందరంపాదాలను చుట్టవేసింది. మాటలలో ఇమడని వేదనతో తల్లడిల్లిపోతూ భర్తతన్నులనూ, దెబ్బలనూ నోరుమెదపకుండా భరిస్తూ ఎల్లాగో తెల్లవార్చింది.

సుందరానికి తెలివివచ్చేసరికి బాగా ఎండెక్కింది. పిల్లలు ఆకలికి గీపురుగావురుమంటున్నారు. సుశీల బియ్యంకోసం ఎక్కిదిగనిగడప లేదు. ఉత్తచేతులతో తిరిగివచ్చి కుప్పగా కూలబడిపోయింది.

"నాన్నా, ఆకలి" అని పిల్లలు చుట్టుకునేసరికి సుందరానికి పట్టరాని దుఃఖం వచ్చింది. ఏడుస్తూ తల గోడకేసి బాదుకున్నాడు. సుశీలముఖం చూడలేక సిగ్గుపడిపోతున్నాడు. మబ్బుతెరలమధ్య కాసేపు నీరెండ కాసినట్లు సుందరంగుండెల్లో బాధ్యత అనే భారం, దాన్ని నెరవేర్చాలనే భావం తొంగిచూసినై. చెమ్మగిల్లుతున్న కళ్లతో, తడబడుతున్న మాటలతో అన్నాడు: "వెళ్లిపోదాం పద. ఇక్కడ నిమిషంకూడా వుండొద్దు"

"ఎక్కడికి! ఎక్కడికి వెళ్లినా ఇంతే" అని సుశీల కళ్లుతుడుచుకుంది. సుందరం బదులుచెప్పకుండా పిల్లల్ని ఒళ్లోకి తీసుకుని నిమురుతూ మౌనంగా కూచున్నాడు.

౨

ఊరుమారింది. అదృష్టంకూడా మారినట్లనిపించింది. సుందరానికి సంగీతం పాఠాలు దొరికినై. సుశీలను చేపట్టిన కొత్తలో ఎంత బుద్ధిగంతుడుగా వుండేవాడో అంత కుదురుగా వుండటం మొదలుపెట్టాడు. నలుగురిలోనూ గౌరవంగా బతకటం సుశీలకు ఇదే మొదటిసారి. మిగిలిన కాలం జీవితంలో ఈమాదిరిగా గడిచిపోతేచాలు. ఇంతకంటే గొంతెమ్మకోరికలు సుశీలకు లేవు. సుందరానికీ లేవు. ఇదివరకు ఎన్నో ఊళ్లు మారారుకాని ఎక్కడా ఇంత హాయిగా, ఇంత స్వేచ్ఛగా, ఇంత నిర్విచారంగా కాలం గడిచిపోలేదు. ఇక్కడ సుశీలకుకూడా చేతినిండా పని. పెళ్లిళ్లుకాని పిల్లలూ, కాపురానికి వెళ్లని పిల్లలూ గుంపులుగుంపులుగా వచ్చి సుశీలదగ్గర సంగీతం నేర్చుకుపోతున్నారు. తనూ, పిల్లలూ, భర్తా కొరతలేకుండా సాఫీగా జీవితాన్ని గడపటం ఇదే మొదలు.

ఇంతకాలమూ సుశీల ప్రవాహానికి ఎదురీది వేసారిపోయింది. ఇప్పుడు కాలుతన్ని నిలవబడటానికి లోకంలో కొంచెం జాగా దొరికింది. సుశీల తనచుట్టూ తేరిపారజూచింది. తను ఎల్లకాలమూ లోకంతో పోరాడుతూ బతకవలసిందేనా? తనకుమాత్రం శాంతి అవసరం లేదా? సుఖం అక్కరలేదా? కావాలి. తనకుకూడా సమాజంలో గౌరవం కావాలి. ఆదరణ కావాలి. మన్ననకావాలి.

ఇంతకాలమూ సుశీల సమాజాన్ని నిరసించింది. సమాజం చేసిన శాసనాలను ధిక్కరించింది. అటువంటి సుశీల ఒక్కసారిగా సమాజంలో గౌరవాన్ని పొందాలని సంకల్పించింది. సుందరం తనను ఎంతదూరంగా దులిపినాసరే అతన్నే అంటిపెట్టుకుని వుండాలి. అతను ఎన్ని బాధలకు గురిచేసినా సరే అన్నిటినీ సహించి, క్షమించి అతని అడుగుజాడల్లోనే నడిచిపోవాలి. ఆదర్శమైన భార్య చెయ్యవలసిన విధులన్నీ తూచా తప్పకుండా నిర్వర్తించాలి. అణకువతో, ఓర్పుతో, సౌజన్యంతో సుశీల సమాజాన్ని మెప్పించి తమ దాంపత్యాన్ని గుర్తించేట్లు చెయ్యాలని నిశ్చయించుకుంది.

ఇంటింటా సుశీలాసుందరాల దాంపత్యం ఆదర్శప్రాయమైనదనే అభిప్రాయం వ్యాపిస్తోంది. అనురాగంలో, అనువర్తనలో, అందచందాలలో సుశీలాసుదర్శనాల జంటకు దీటైన జంట ఆఊళ్లో లేదని ఇంటింటా అనుకోటం సుశీలకుకూడా వినవచ్చింది.

ఇప్పుడు సుశీలకు జీవితంలో ఇదివరకు లేని ధీమా వచ్చింది. మును పెన్నడూ చవిచూసి ఎరగని ఆనందంతో ఆమెఅంతరంగం గంతులు వేయసాగింది. తన గతచరిత్రను లోకుల కళ్లు చీల్చిచూడలేని దట్టమైన ముసుగులచాటున దాచివేసింది. తనకు ఏవిధమైన సంకోచమూలేదు. భీతి లేదు. అశాంతి లేదు. సంఘగౌరవంలో ఇంత భద్రమైన సుఖం, శాంతీ దొరకగలవని సుశీల ఊహించనైనా లేదు.

అప్పుడప్పుడూ తనకు తెలియకుండానే సుశీల గుండెలు భయంతో గజగజ వణికేవి. తను ఒక అగ్నిపర్వతంమీద నిలబడింది. అయినప్పటికీ కైలాసశిఖరంమీద విహరిస్తున్నంత ఆనందంతో పొంగిపోతోంది. తన కాళ్లక్రింద అగ్నిపర్వతం ఏక్షణమైనా బద్దలైపోవచ్చు. అప్పుడు సమాజంలో తన గౌరవం గాలిమేడలాగా కుప్పన కూలిపోవచ్చు. అవమానమనే భస్మరాసులలో తను నామరూపాలు లేకుండా మాయమైపోవచ్చు. సుశీల పైకి ఎంతనిబ్బరంగా, ఎంత హాయిగా కనిపించినా లోపల ఈభయంమాత్రం ఏకోశానో గూడుకట్టుకుని దాగివుంది.

ఇల్లా వుండగా ఒకనాటి ఉదయాన నిగనిగలాడే రాగిచెంబుతో, కొట్టవచ్చే విభూతిరేకలతో, చినుకుల్లాయిగుడ్డలతో ఉపాదానంకోసం "శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః"అంటూ ఒక బీదబ్రాహ్మణుడు సుశీలకళ్ల ఎదుట సాక్షాత్కరించాడు. ఆయన్ను చూడగానే సుశీల పెద్దపులిని చూసిన లేడిలాగా బెదిరిపోయింది. ఆయనకూడా సుశీలకేసి రెప్పవాల్చకుండా నఖశిఖపర్యంతమూ శల్యపరీక్ష చేస్తూ నిలబడిపోయాడు. సుశీల చరచరా లోపలికి వెళ్లి దోసెడు బియ్యం పట్టుకువచ్చి ఉపాదానం పెట్టింది. లోపలికి వెళ్లిపోబోతుంటే ఆ బ్రాహ్మణవృద్ధుడు "ఇదుగో, అమ్మాయ్, వృద్ధాప్యంవల్ల చూపు సరిగా ఆనటంలేదు. మనిషిని బోలిన మనిషి వుండొచ్చు.

నేను పారబడవచ్చు" అంటూ దీర్ఘమైన ఉపోద్ఘాతంతో "నువ్వు ఫలానావారి కూతురివి కాదూ? ఫలానావారి కోడలివికావూ? మీఅత్తవారిది ఫలానాగ్రామం కాదూ?" అని గుక్కతిప్పుకోలేని ప్రశ్నలవర్షం కురిపించాడు.

సుశీల తలవంచేసుకుని అన్నిటికీ తలఊపింది. నోరు మెదపలేకపోయింది. అరికాళ్లలోంచి గజగజ వణుకు పుట్టుకొస్తోంది ఆముసలాయనను తాను వెంటనే గుర్తించింది. ఇంకా అనుమానమెందుకు? ఈయన వేసుల వెంకయ్య. తన పుట్టింటివారి ఊరే ఈయనది. రాగిచెంబు చేతపుచ్చుకుని ఈయన తిరగని రాజ్యం లేదు. సంపాదించిన ఉపాదానపు బియ్యంతోపాటు అక్కడి కబుర్లిక్కడికీ, ఇక్కడి సంగతు లక్కడికీ సునాయాసంగా జేరవేసి చిలవలుపలవలల్లి ప్రచారంచెయ్యటంలో అందెవేసిన చెయ్యి. ఈయన్ను చూసే చూడటంతోటే సుశీలకు తన గతజీవితంలోంచి ఒక పెనుభూతం లేచివచ్చి ఈ ముసలిబ్రాహ్మణి రూపంలో తనను వెన్నంటబోతున్నట్లనిపించింది. గతాన్ని కప్పివేసి తను ఈమధ్య మునిగితేలుతున్న సుఖానికి స్వస్తివాచకం చెప్పటానికే ఈ బ్రాహ్మణోత్తముడు అక్కడికి వేంచేసినట్లనిపించింది. తన గతచరిత్ర తనమీద కసితీర్చుకోవటంకోసమే ఈ బీదబ్రాహ్మణవేషంతో కత్తికట్టుకు వచ్చినట్లనిపించింది. ఉపాదానంతో చెంబు నింపుకుని వేసులవెంకయ్య వెళ్లిపోయి చాలాసేపయింది. కాని సుశీలమనసులో ఆయనరూపం భయంకరంగా హత్తుకుపోయింది. లోపలలోపల చెదిరిపోతోంది.

అనుకున్నంతా జరిగింది. అగ్గిపుల్లలాటి ముసలిబాపడు సుశీలసుఖానికి చిచ్చుపెట్టి మరీ వెళ్లాడు. ఇంత భయంకరమైన అగ్నిపర్వతంమీద నిలబడ్డట్లు సుశీల గ్రహించలేకపోయింది. సమాజంలో తను సంపాదించిన మన్నన, గౌరవం, ఆదరం అన్నీ నీటిబుడగల్లాగా పుటుక్కుమన్నయ్. ఏమూలవిన్నా పడగవిప్పిన తాచులాగా లోకంబుసబుసలే. ఏమూల చూసినా మీదికి దుమికేందుకు సిద్ధంగా వున్న భీకరరాక్షసిలాగా నాలుక చాపి కోరలు బైటపెట్టి ఉరిమిచూసే లోకమే కనిపిస్తోంది. తను అగ్నిసాక్షిగా పెళ్లాడిన భర్తని-సమాజం యావజ్జీవనమూ ఇతని పాదాల దగ్గిరే పడివుండు అని బంధించిన కురూపిని-క్షయరోగిని విడిచివేసింది. తనకు సంగీతం చెబుతున్న అందగాడు సుందరంతో మనసుకలిసింది. అతనితో కలిసి ఎవరికీ చెప్పకుండా ఎవరికీ తెలియని అర్ధరాత్రివేళ పుట్టిన ఇంటికీ మెట్టిన ఇంటికీ దూరంగా తరలిపోయింది. ఇది ఇరవైయేళ్లకిందటి మాట. అప్పటికి సుశీల పదహారేళ్లపడుచు.

నిమిషంలో ఊరంతా పాక్కిపోయింది. అందరి నోళ్లలోనూ సుశీల నలిగిపోయింది. అందరూ ఆమెను 'లేచిపోయివచ్చిన మనిషి' అని చీదరించుకున్నారు. అందరి కళ్లకూ సుశీల కులటగా కనిపించింది. అంతకుమించినగౌరవం ఇవ్వటం అందరికీ అనవసరమనిపించింది. సుశీలాసుందరాల బతుకు క్షణంలో నడిబజార్లో నవ్వులపాలైపోయింది. వాళ్లజీవితం పొద్దుపోనివాళ్లందరికీ ఆటవస్తువైపోయింది.

మర్నాటినుంచీ వీళ్ల ఇంటికి రాకపోకలు బందయిపోయినై. సంగీతంపాఠాలన్నీ ఒక్కసారిగా చెయ్యిజారిపోయినై. ఊళ్లో పిలిస్తే పలికే జీవికే కరువయింది.

క్రమక్రమంగా మునుపటి దారిద్ర్యమే మళ్లీ నగ్నంగా తాండవించటం ఆరంభించింది. ఆకలిచిచ్చుకు తాళలేక పిల్లల ఏడ్పులూ, ఇంట్లోంచి లేచిపొమ్మని ఇంటివాళ్ల ఒత్తిడీ, పూటలతరబడి అన్నంముఖం చూడకుండా పస్తులూ! ఈదారిద్ర్యమంతా చాలనట్లు సుశీలకు నిండునెలలు...ఎటు చూసినా దరీ తెన్నూ కనబడటంలేదు.

సరిగా ఇదేసమయానికి సుందరం మళ్లీ మామూలు దారినే తొక్కి జూదరులతోనూ, తాగుబోతులతోనూ తిరగటం మొదలుపెట్టి రోజులతరబడి ఇంటిచాయలకు రావటమే మానేశాడు. వచ్చినప్పుడు-తెలివిగా వున్నసమయంలో ఇంట్లో బాధలను చూసి జడివానలాగా కన్నీరు కురిపిస్తాడు. ఇదుగో ఏదైనా బతుకుతెరువు దొరుకుతుందేమో వెతుక్కువస్తానని లేచి బయలుదేరి అదేపోత పోతాడు. మళ్లీ రెండుమూడురోజులుదాకా జాడా జవాబూ వుండదు.

ఇక సంసారాన్ని ఈదట మెల్లాగా అన్నే దిగులుతో సుశీల కుంగి కృశించిపోతోంది. ఈ ఆపదలో ఆదుకుని ఆదరించే ఆప్తు లెవరున్నారు? కళ్లుపొడుచుకున్నా దారి కనబడని చీకటిలో కొట్టుమిట్టాడుతూ కుమిలిపోతోంది. దినమొకయుగంగాగడుస్తోంది.

3

రేపుపొద్దున ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోతానని సుశీల మాట ఇచ్చింది. వెళ్లకపోతే రౌడీలను తీసుకువచ్చి బైటికి గెంటిస్తానని ఇంటియజమాని అల్టిమేటమ్ ఇచ్చి మరీ వెళ్లాడు. తెల్లవారేలోపుగా సుందరం ఇంటికి వస్తాడేమో నని ఎంతో ఆశపడింది. అప్పటికి మనిషి కంటికి కనబడి రెండురోజు లయింది.

సుందరం రాకపోతే తనేం చెయ్యాలి? నడి బజారులో చెట్టుకింద దిక్కు లేని పక్షిలాగా అల్లాడిపోవాలి. చింపిరిగుడ్డలతో, చిక్కిపోయిన ఆకారాలతో తనూ పిల్లలూ దరిద్రదేవతల్లాగా ఆకలికి అల్లాడుతూ ఎక్కడో తల దాచుకోవాలి. తనను దయతలచి పట్టెడన్నం పెట్టే వాళ్లుకూడా లేని ఆ ఊళ్లో ఎల్లా కాలం వెళ్లదీగాలి? ఈ ఊరు విడిచి ఇంకెక్కడికైనా వెళ్లిపోతే? ఏం లాభం? ఎన్ని ఊళ్లు మారినా అదృష్టంమాత్రంమారదు. తను ఈజీవితంలో కష్టాలకోసమే జన్మించినట్లున్నది. సుఖం ఎండమావిలాగా దూరంగా పారిపోతోంది. దుఃఖం, దారిద్ర్యం, దైన్యం ఇవే తనను వీడని చెలికత్తెలు. కన్నీరే తనకు పిలిస్తే పలికే బంధువు...తలుచుకున్న కొద్దీ సుశీల తట్టుకోలేక తల్లడిల్లిపోతోంది. "ఇంక క్షణంకూడా నేను కాలుతన్ని నిలబడలేను. ఇంక రెప్పపాటుకూడా లోకానికి ఎదురీదగల సత్తువ లేదు. ఇక్కడితో నాజీవితాన్ని సమాప్తిచెయ్యి" అని విధిని వేడుకోసాగింది. ఈ దీనమైన ఆక్రందనతో సుశీల కన్నీరు కట్టతెగిన ప్రవాహంలాగా ఆగకుండా పొంగి వచ్చింది. దీనంగా నానాటికీ దిగనాసిల్లిపోతున్న పిల్లలకేసి చూసేసరికి కడుపు తరుక్కుపోయింది. గుండె భగ్గున రగిలిపోయింది. ఇంత విశాలమైన ప్రపంచంలో తనను కనికరించేవారొక్కరూ లేరా? ఈ కష్టదశలో తనను ఆదుకునే జాలిగుండె ఒక్కటే లేదా? తనకు బలగం తక్కువా? తల్లిదండ్రులున్నారు. అన్నదమ్ము లున్నారు. చెల్లెళ్లున్నారు. అంతా వున్నారు. కాని తనకు ఎవరూ లేరు. తను ఎవరికీ లేదు. ఈ లోకంలో ఒంటరిది. సుందరంకోసమే అందరినీ వదలి వచ్చేసింది. అతనికోసమే ఇన్ని సుడిగాలులనూ, ఇన్ని తుపానులనూ ఒంటరిగా ఎదుర్కొంటున్నది. ఇప్పుడుమాత్రం ఇక నిలబడలేక కూకటివేళ్లతో కూడా పెళ్లగిల్లి నేలకూలిపోయేట్లుంది. విధితో అలసట లేని పోరాటంలో బతుకంతా గడపగల శక్తి ఎవరి కుంటుంది? ఈ బాధలో, ఈ దుఃఖంలో సుశీలలో దాగిన పిరికితనం తలఎత్తింది. పిల్లల్ని తీసుకుని పుట్టింటికి పోతే? వారి కాళ్లమీద పడి క్షమించమని కోరితే? వారు జాలి తలచి, తననూ తన పిల్లల్నీ దగ్గరికి తీసి ఆదరించరా? ఛీ... అల్లాఎన్నిటికీ జరగను. నేను చేసిన తప్పేముంది? క్షమించమని వేడుకునేటంత అపరాధం నేనేం చేశాను? నేనూ నాపిల్లలూ ఆకలికి అల్లల్లాడి ఏ చెట్టుకిందనైనా ప్రాణాలు విడుస్తాం. అంతే కాని సుందరాన్ని విడిచి, ఈ స్థితిలో పుట్టింటికి పోవటంకంటె క్రూరమైన, ఘోరమైన పని మరొకటి వుండబోదు. తను జీవితానికి లొంగిపోదు. పరిస్థితులతో రాజీ చేసుకోదు. తను పోరాటానికే పుట్టింది. కదనరంగంలోనే నేలకూలి కళ్లు మూసుకుంటుంది. కాని, తనతోపాటు ఏ పాపమూ ఎరగని పసికూనలను అగచాట్లపాలు చెయ్యటానికే చచ్చిన చావుగా వుంది తను కష్టాలుపడుతున్నందుకు చింతలేదు. తనతోపాటు ఈ నిర్భాగ్యులుకూడా అల్లాడిపోతున్నందుకే సుశీల తల్లడిల్లిపోతోంది.

పగలంతా సుశీలగుండెల్లో ఎడతెగని కల్లోలం. చీకటిపడింది. పిల్లలు మూలల నక్కి కాలే పొట్టలతో జాలిగా ముడుచుకుని పడుకున్నారు. సుశీల తల తిరిగిపోతోంది. ఆకలీ, వేదనా, ఆక్రోశం. ఈ రాత్రికయినా సుందరం ఇంటికి వస్తాడేమో నన్న ఆశ మిణుకుమిణుకుమంటోంది. తన బతుకు ముందేమి కానున్నదో అగాధంగా వుంది. తనను సుందరం నడిసముద్రంలో ముంచినాసరే అతన్నే నమ్ముకుంది. అతని పేరు చెప్పుకునే నుదుట కుంకుమ దిద్దుకుంటోంది. అతని జీవితంతో తనకు తెగిపోని బంధం. అతను పాతాళానికి ఈడ్చుకుపోయినాసరే, తను వెదలకుండా అనుసరిస్తుంది. తనతోపాటు పిల్లల్నికూడా తీసుకుపోతుంది. లోకం

ఒప్పుకోక గర్జించినప్పటికీ తను సుందరం నాభర్త అని గర్వంగా చాటుకుంటుంది...తలుపుతట్టిన చప్పుడు.

సుశీల గబగబా లేచివెళ్లి తలుపుతీసింది. ఒక్కసారిగా గుండె ఆగినట్లయిపోయింది. బురదకొట్టుకున్న గుడ్డలతో, తలలోంచి చిమ్ముతున్న నెత్తురుధారలతో వికృతంగా, భీకరంగా సుందరం తూలుతూ సోలుతూ లోపలికి అడుగుపెట్టాడు. అడుగుపెడుతూనే నేలమీద వాలిపోయాడు. సుశీల కళ్లనీళ్లు తుడుచుకుంటూ ఎన్నో ఉపచారాలు చేసింది. సుందరంనోట్లోంచి మాట పెగలటం లేదు. ఏం జరిగిందో తెలియదు. సుశీల దిక్కులేని పక్షి. ఆ రాత్రివేళ ఎవరిని వెళ్లి బతిమాలుకున్నా ఒక్క పిట్టకూడా ఇంటికి రాలేదు. ఈ గందరగోళం విని, పిల్లలు నిద్రలేచి తండ్రిఆకారాన్ని చూసి కెవ్వున ఏడవటం మొదలుపెట్టారు. ఎల్లా తెల్లవరిందో ఈశ్వరుడికే తెలియాలి.

సూర్యోదయ మయేసరికి సుందరం ప్రాణాలు ఆగిపోయినయ్. కొనఊపిరి కాస్తా కళ్లలోంచి ఎగిరిపోయింది. ఈ భయంకరదృశ్యాన్ని చూసేసరికి సుశీలకి ఏడవటానికికూడా నోరురాలేదు. గుండె బండబారిపోయింది. లోకమంతా శూన్యంగా, అగాధంగా తోచసాగింది.

రాత్రి రానివాళ్లంతా తెల్లవారేసరికి కమ్ముకున్నారు. ఎవరికి తోచిన మాట వారంటున్నారు. జూదంలో ఎవరితోనో కలియబడితే ఎవరో చావగొట్టారని కొందరూ, తాగి ఎవరింట్లోనో జొరబడితే తలబద్దలుగొట్టారని కొందరూ, చేసుకున్నది అనుభవించక తప్పదని కొందరూ, నోటికి వచ్చినట్లు వాగటం సాగించారు. ఆనాడు దహనసంస్కారానికికూడా ఎర్రని ఏగానీ ఇంట్లో లేదు. వీణా, మద్దెలా, హార్మోనియం, ఫిడేలూ వున్నయ్. ఒక్క ఫిడేలుమాత్రం అట్టేపెట్టుకుని మిగిలినవన్నీ అమ్మివేసి అంత్యక్రియలు జరిపించింది. బతికివుండగా సుందరాన్ని అవమానించినవాళ్లందరూ అతని అంత్యక్రియలు జయప్రదంగా నడిపించడానికి సాయపడ్డారు.

లోకం మాత్రం ఎంతో నిర్దయతో "వీడు పోతే మరొకడూ" అనివేసింది. "లేచిపోయి వచ్చిన మనిషికి నీతి ఏమిటి?" అని తేలికగా కొట్టిపారేసింది.

సుశీలమాత్రం వీటిని వినిపించుకోలేదు. ఎవరికీ చెప్పకుండా పిల్లల్ని వెంటబెట్టుకుని, సుందరంస్మృతిచిహ్నమైన ఫిడేలును తీసుకుని తెల్లవారేటప్పటికి అదృశ్యమైపోయింది. ఎవరికి తోచినట్లు వాళ్లు తీర్మానించారు.

నెలరోజులుదాటినాక సుశీల రామేశ్వరంనుంచి తిరిగివచ్చింది. ఆమెను చూసి లోకం ముక్కుమీద వేలువేసుకుంది. చూసి నిశ్చేష్టులు కానివారు లేరు. ఆమె ఆకారంలో మాంగళ్యం సూచించే చిహ్నాలన్నీ మటుమాయమైనయ్. ఆమె అందానికి వన్నెలు దిద్దిన తుమ్మెదరెక్కలలాంటి నొక్కులజుట్టుకూడా సుందరానికి అర్పించి వచ్చింది.

అనుకోకుండా సుశీల పిల్లలతో ఆ ఊళ్లో దిగింది. వంటలుచేసుకుని అయినా పిల్లల్ని బతికించుకోవాలని నిశ్చయించుకుంది. ఆమెదిగిన పెట్టెలోనే ఒక నడివయసు మనిషి భార్యతోనూ, పిల్లలతోనూ ఎక్కాడు. ఆ మనిషిని సుశీల పోల్చుకుని గజగజ వణికిపోయింది. ఎన్నోఏళ్లకిందట తన మెడలో పుస్తెకట్టిన భర్త అతనే. మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. సరిగా ఈసమయంలోనే ఎందుకు తారసిల్లాలి? ఎవరో శూలంతో వెన్నులో పొడిచినట్లు సుశీల గిలగిల తన్నుకుంది. ఇన్ని ఊళ్లుండే తను ఆ ఊరికే ఎందుకు రావాలి? ఇన్ని ఏళ్లనుంచీ జరగని సంఘటన ఇనాళే ఎందుకు జరగాలి? ఈ కష్టదశలోకూడా విధి తనను ఈ విధంగా వెక్కిరించాలా? అయోమయంలో పడి సుశీల ఉక్కిరి బిక్కిరయింది. "అమ్మా. ఇంటికి వెళ్దామా?" అని పిల్లలు. అప్రయత్నంగా "పోదాం" అనేసింది. ఎక్కడిఇల్లు? ఎక్కడికి పోవటం? ఏమిటి చెయ్యటం?